జీవన్రావు జీవితంలో చేసిన మొదటి తప్పు తను రెండో పెళ్ళి చేసుకోడమే. అదీ యాభై ఏళ్ళు పైబడిన తర్వాత చేసుకోవడం. భార్య పేరు ప్రియశీల. ఆమె వయస్సు ఇరవై ఒకటి.

ఆమెని వివాహం చేసుకునేటప్పుడు అతగాడి అవసరాలు అతగాడివి. పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాకే చేసుకున్నాడు.

తను ఆఫీసు పనులు చూసుకోవడానికి తరచూ ఇతర వూళ్ళు వెళ్తుండేవాడు. తను ఇంట్లో లేనప్పుడు ప్రియశీల తను ఆఫీసులోని అక్కౌంటెంట్‌తోనూ, పక్కింటి డాక్టర్ కొడుకుతోనూ కలిసి తిరుగుతూందని తెలిసింది. కాబట్టే ప్రియశీలని శంకించాల్సి వచ్చింది.

అతగాడికిదో మానసిక వ్యధగా మారింది. ఆఫీసులో గుసగుసలు, ఫ్రెండ్స్ ఎత్తిపొడుపులు మొదలయినవి అతగాడి అనుమానానికి మరికొన్ని కారణాలు.

ఇలా కాదని ఆయన ఓ దృఢ నిశ్చయాని కొచ్చాడు.

"షార్ప్ అండ్ క్విక్" ప్రయివేట్ డిటెక్టివ్ ఏజన్సీ ఆఫీసుకెళ్ళి తన భార్య విషయం చెప్పి, ఆమెని ఓ నెలరోజులపాటు గమనిస్తుండమని చెప్పాడు. రోజూ ఇరవై నాలుగు గంటలూ ఆమెని ఫాలో అవుతుండమని మరీ మరీ చెప్పి, అందుకు గాను ఫీజుగా ఓ రెండువేలిస్తూ ఆమె ఫోటో ఒకటిచ్చి మరీ కట్టుదిట్టం చేశాడు.

ఇక నిశ్చింతగా వున్నాడు జీవన్రావు.

ఎలాగైతేనేం నెల గడిచిపోయింది. డిటెక్టివ్ రిపోర్టు చేతికొచ్చింది. దాని సారాంశం ఇది:

"ప్రియశీల కారెక్టర్ మంచిదే! మీరే ఆమెని అపార్థం చేసుకున్నారు. ఆమెకు అక్కౌంటెంట్‌తోనూ, డాక్టర్ కొడుకుతోనూ అక్రమ సంబంధాలు లేవు. ఆమె వాళ్ళింటికెళ్తుంది, కానీ వారిని బ్రదర్స్‌లా ట్రీట్ చేస్తుంది. కాబట్టే ఆమెని అనుమానించవలసిన అవసరం లేదు."

అది చదివిన తర్వాత చాలా సంతోషించాడు జీవన్రావు. తన భార్య మీదున్న అనుమానం కాస్త తొలగిపోయింది. వెధవ ఆలోచనల్తో బుర్ర పాడు చేసుకున్నందుకు తనను తానే నిందించుకున్నాడు.

కొన్ని నెలలు దొర్లాయి.

మళ్ళీ భార్య శీలం మీద అనుమానం కలిగింది జీవన్రావుకి. ఛస్, ఇక ఉపేక్షించి లాభం లేదని ఈసారి మరో డిటెక్టివ్ ఏజన్సీని సంప్రదించాడు. ఎలాగైనా ఆమెని 'ఆ' సమయంలో పట్టుకుని వదిలించుకోవాలని ప్లాన్ వేసుకున్నాడు.

మరో నెలకు డిటెక్టివ్ ఏజన్సీ నుండి ఓ కవరు వచ్చింది. కవరు ఓపెన్ చేసి చదవడం ప్రారంభించాడు.

ఆగస్టు ఒకటి:

పగలు పది గంటలకు పక్కింటి డాక్టరుగారింటికి కప్పు కాఫీపొడి తీసుకుని వెళ్ళి మధ్యాహ్నం పన్నెండున్నరకి తిరిగొచ్చింది.

ఆగస్టు రెండు, మూడు ఖాళీ.

ఆగస్టు నాలుగు:

ఒంటరిగా ఫస్ట్ షో సినిమాకెళ్ళింది. ఎవర్తోనూ కలవలేదు.

ఆగస్టు ఐదు నుండి తొమ్మిది వరకూ మీతో గడిపింది.

ఆగస్టు పది:

సాయంత్రం ఐదున్నరకి 'షార్ప్ అండ్ క్విక్' డిటెక్టివ్ ఏజెన్సీకెళ్ళింది. అక్కడో ఏజంట్‌తో కలిసి సినిమాకెళ్ళి, అలాగే లాడ్జింగ్‌కెళ్ళి, రాత్రి పన్నెండూముప్పావుకి




ఇంటికి చేరింది.

ఇలాగే... ... ... ...

... ... ... ... ... ... ...

నెల పూర్తయింది... ... .

రిపోర్టు చదివిన జీవన్రావు అవాక్కయ్యాడు. జీవితంలో తను రెండో తప్పు చేశాడు. జీవితం మీదే విరక్తి కలిగింది. ఇలాతను డిటెక్టివ్‌లని నియమిస్తూ ఆమెగారి విజిటర్స్ సంఖ్య పెంచేయడమే తను చేసిన సెకండ్ మిస్టేక్.

—షేక్ సిరాజుద్దీన్

## టి.వి.కార్టూన్ స్ట్రిప్

### రాజావారి కేశరాణి

